
సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
శుక్రవారం
07-02-2025
పేజీలు: 02

# సీఎం సిద్ధరామయ్యకు బిగ్ రిలీఫ్..
# కర్ణాటక హైకోర్టు సంచలన తీర్పు



ముడా స్కామ్ వ్యవహారంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు భారీ ఊరట లభించింది. ముడా ఇళ్ల స్థలాల కేసును సీబీఐకి అప్పగించాలని మైసూరు సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన కర్ణాటక హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేస్తూ.. సంచలన తీర్పును వెలువరించింది. కాగా, లోకాయుక్త ముడా స్కామ్‌లో పోలీసులు సక్రమంగా దర్యాప్తు చేయలేదని, కాబట్టి ఈ కేసును సీబీఐకి అప్పగించాలని స్నేహమయి కృష్ణ పిటిషన్ దాఖలు చేశారు. కేసు ఇరు పక్షాల వాదనలు విన్న చీఫ్ జస్టిస్ ఎం.నాగప్రసన్న గత నెల 28న తీర్పు రిజర్వు చేశారు. విచారణ సందర్భంగా పిటిషన్ వేసిన వ్యక్తికి దర్యాప్తు సంస్థను ఎంపిక చేసే హక్కు లేదని ధర్మాసనం పేర్కొంది.అయితే, పిటిషనర్ తరఫు న్యాయవాది రాజకీయ ఒత్తిడితో దర్యాప్తు పక్కదారి పట్టించవచ్చని ఆరోపించారు. నిజానిజాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ దర్యాప్తు అనివార్యమని కోరారు. మరోవైపు సీఎం తరఫు న్యాయవాది కపిల్ సిబల్ అన్ని కేసులను సీబీఐకి అప్పగించాలనడం సరికాదని కోర్టుకు తెలిపారు. ఇలా అయితే లోకాయుక్త పని చేయడం ఎందుకని వాదనలు వినిపించారు. లోకాయుక్త పోలీసులు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటారని అంటున్నారని, సీబీఐ కూడా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న సీబీఐ స్వతంత్ర దర్యాప్తు సంస్థ కాదని తెలిపారు. లోకాయుక్త దర్యాప్తు స్వతంత్రంగా ఉంటుందని కబిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు ముడా కేసును సీబీఐకి బదిలీ చేయాలన్న పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పును వెలువరించింది.



## ట్రంప్ మరో
## కఠిన నిర్ణయం

రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. సంచలన నిర్ణయాలు తీసుకుంటూ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నారు. ట్రంప్ ఇప్పటికే వివిధ దేశాలపై సుంకాలను వడ్డిస్తూ వాణిజ్య యుద్ధానికి తెరతీసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా పలు దేశాలపై ఆంక్షలు, వలసదారుల పట్ల కఠిన వైఖరితో వ్యవహరిస్తూ పాలనలో తన మార్క్ చూపిస్తున్నారు. తాజాగా అమెరికాలోని కొన్ని సంస్థల్లో సమూల ప్రక్షాళన చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే ప్రపంచంలోనే అతిపెద్ద సహాయ సంస్థ అయిన 'అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ'లో పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగించేందుకు రెడీ అయ్యారు. యూఎస్ఏఐడీలో ప్రస్తుతం 10వేల మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ సంఖ్యను 300 దిగువకు తీసుకురావాలని ట్రంప్ భావిస్తున్నారు. ఈ క్రమంలో 9,700 మందికిపైగా ఉద్యోగులను తొలగించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్లాన్ చేస్తోంది. కేవలం 294 మంది మాత్రమే ఏజెన్సీలో పనిచేసేలా ట్రంప్ ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. వీరిలో 12 మంది ఆఫ్రికా బ్యూరో, ఎనిమిది మంది ఆసియా బ్యూరోలో ఉండేలా సవరణలు కూడా చేసినట్లు సమాచారం.



## మహాకుంభమేళాలో
## మరోసారి అగ్నిప్రమాదం

యూపీలో జరుగుతున్న ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహా కుంభమేళాలో మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. సెక్టార్-18 శంకరాచార్య మార్గంలోని ఓ గుడారంలో మంటలు చెలరేగాయి. మంటల కారణంగా ఆ ప్రాంతంలో దట్టమైన పొగ అలుముకుంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ సర్వేశ్ కుమార్ జాతీయ మీడియాకు తెలిపారు. కాగా కొద్ది రోజుల క్రితం సెక్టార్ -22 లో గ్యాస్ సిలిండర్లు పేలడం వల్ల అక్కడ అగ్నిప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. మరోవైపు జనవరి 13 నుంచి కొనసాగుతున్న మహాకుంభమేళా అధికారికంగా ఫిబ్రవరి 26న ముగియనున్నది. గురువారం నాటికి 39 కోట్ల మంది భక్తులు కుంభమేళాను సందర్శించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# తండేల్ రివ్యూ




యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి కలయికలో వచ్చిన మూవీ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ప్రేక్షకులను ఈ సినిమా ఏ మేరకు మెప్పించిందో రివ్యూలోకి వెళ్లి తెలుసుకుందాం!

శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన రాజు (అక్కినేని నాగచైతన్య) సముద్రంలో చేపల వేటకు వెళ్తాడు. తన తోటి వారి కోసం అండగా నిలబడుతూ ఉంటాడు. మరో వైపు సత్య (సాయి పల్లవి) అంటే రాజుకు ప్రాణం. రాజు అంటే సత్యాకి కూడా అంతే ప్రాణం. చిన్న తనం నుంచే ఇద్దరూ ఘాడంగా ప్రేమించుకుంటారు. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో చేపల వేటకు వెళ్లిన రాజుని పాకిస్తాన్ కోస్టల్ గార్డ్స్ అరెస్ట్ చేస్తారు. పరాయి దేశంలో జైలుపాలైన రాజు, అతని టీమ్ రాక కోసం సత్య ఏం చేసింది ?, రాజు కోసం సత్య ఎంతటి వేదన అనుభవించింది?, అసలు మనసులో రాజును పెట్టుకుని, సత్య ఎందుకు మరో పెళ్లికి ఒప్పుకుంటుంది ?, చివరకు సత్య – రాజు ఒక్కటి అయ్యారా ? లేదా ? అనేది మిగిలిన కథ. ఈ తండేల్. కథలోని వాస్తవిక అంశాలు, అలాగే ఎమోషనల్ గా సాగే లవ్ ట్రాక్, అక్కినేని నాగచైతన్య పాత్రలోని ఎమోషన్స్, సాయి పల్లవి పాత్రలోని వేదన.. ఇలా కథలోని ప్రధాన ఎలిమెంట్స్ సినిమా స్థాయిని పెంచాయి. హీరోహీరోయిన్లు ఒకరి కోసం ఒకరు పడే బాధ, ఆవేదన కోణంలో సాగే సీక్వెన్సెస్ కూడా చాలా బాగున్నాయి. దర్శకుడు చందూ మొండేటి బలమైన ఎమోషనల్ సన్నివేశాలతో పాటు కొన్ని హార్డ్ హిట్టింగ్ ఎమోషనల్ క్యారెక్టర్లను కూడా ఆయన బలంగా రాసుకున్నారు. అలాగే చైతుకి, సాయి పల్లవికి మధ్య కెమిస్ట్రీ కూడా బాగా అలరిస్తుంది. హీరోగా నాగచైతన్య నటన చాలా బాగుంది. గుండె బద్దలైన ప్రేమికుడిగా చైతు తన పాత్రలోకి ఒదిగిపోయాడు. మానసిక సంఘర్షణతో అనుక్షణం నరకం అనుభవిస్తూ ఉండే తన పాత్రకు సాయి పల్లవి పూర్తి న్యాయం చేసింది. ముఖ్యంగా కొన్ని ఎమోషనల్ సీన్స్ లో ఆ పెయిన్ అర్థమయ్యేలా కేవలం తన కళ్లల్లో సాయి పల్లవి పలికించిన హావభావాలు మెచ్చుకోదగినవి. మరో కీలక పాత్రలో నటించిన దివ్య పిళ్ళై తన నటనతో ఆకట్టుకోగా.. ఇక ఎప్పటిలాగే మరో పాత్రలో కనిపించిన ఆడుకాళం నరేన్ కూడా బాగా నటించాడు. కరుణాకరన్ తో పాటు మిగిలిన నటీనటులు కూడా తమ పాత్ర పరిధి మేరకు బాగా నటించారు. మొత్తమ్మీద చందూ మొండేటి రాసిన కథనం మరియు పాత్రలు ఎమోషనల్ గా సాగుతూ ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా కథను దర్శకుడు చాలా సున్నితంగా నడుపుతూ.. సినిమాలో ప్రేమతో పాటు ఆ ప్రేమలోని ఎమోషన్ని, పెయిన్ని కూడా హైలెట్ అయ్యే విధంగా కొన్ని ఏమోషనల్ సన్నివేశాలను చాలా బాగా మలిచాడు. దర్శకుడు చందూ మొండేటి.. కథలోని ప్రధాన పాత్రలను, కథా నేపథ్యాన్ని అలాగే సినిమాలో కొన్ని ఎమోషన్స్ ను బాగా ఎలివేట్ చేసినా.. సినిమాలో కొన్ని సన్నివేశాలు స్లోగా సాగుతూ రెగ్యులర్ సీన్సే కదా అని ఫీల్ ని కలిగిస్తాయి. అలాగే హీరో హీరోయిన్ల మధ్య వచ్చే కొన్ని లవ్ సీన్స్ కూడా ల్యాగ్ అనిపిస్తాయి. మొత్తంగా రెగ్యులర్ ప్లే, స్లో నేరేషన్ వంటి అంశాలు సినిమాకి కొంతవరకు మైనస్ అయ్యాయి. సినిమాలో షామ్ దత్ సినిమాటోగ్రఫీ వర్క్ బాగుంది. ప్రేమ కథకు అనుగుణంగా విజువల్స్ ను చాలా అందంగా చూపించారు.

సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అందించిన పాటలు ఆకట్టుకున్నాయి. నేపథ్య సంగీతం కూడా బాగుంది. ముఖ్యంగా సాయి పల్లవి పై వచ్చే ఎమోషనల్ సన్నివేశాల్లో నేపథ్య సంగీతం చాలా బాగా ఆకట్టుకుంది. ఎడిటింగ్ విషయానికి వస్తే.. ల్యాగ్ సీన్స్ లెంగ్త్ ను తగ్గించి ఉంటే బాగుండేది. సినిమాలో నిర్మాత బన్నీ వాసు పాటించిన ప్రొడక్షన్ వాల్యూస్ కూడా చాలా బాగున్నాయి. దర్శకుడు చందూ మొండేటి రచయితగా దర్శకుడిగా ఆకట్టుకున్నారు. తండేల్ అంటూ వచ్చిన ఈ డీసెంట్ ఎమోషనల్ లవ్ డ్రామా, బలమైన ఎమోషన్స్ అండ్ ఫీల్ గుడ్ సీన్స్ తో సాగుతూ బాగా ఆకట్టుకుంది.

పైగా, గుడ్ కంటెంట్ తో పాటు డీసెంట్ టేకింగ్, మేకింగ్ కూడా ఈ సినిమా స్థాయిని పెంచాయి. ఐతే, స్క్రీన్ ప్లే లో స్లో నేరేషన్ సినిమాకి మైనస్ అయ్యింది. కానీ, చైతు, సాయి పల్లవి తమ నటనతో సినిమాని మరో లెవల్ కి తీసుకు వెళ్లారు. చందూ రచన – దర్శకత్వం కూడా మెప్పించాయి. మొత్తమ్మీద ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది.



## 8 నుంచి తెలంగాణ
## ఓపెన్ చెస్

బొడిగె బాలయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 8, 9 తేదీల్లో తెలంగాణ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ జరుగనుంది. చర్లపల్లిలోని ఈసీ నగర్ కమ్యూనిటీ హాల్ వేదికగా పోటీలు నిర్వహిస్తున్నారు. మొత్తం అండర్-7, 9, 11, 13, 15 విభాగాల్లో జరుగనున్న టోర్నీ ప్రైజ్‌మనీ 60వేలుగా నిర్వాహకులు ప్రకటించారు. టోర్నీలోపోటీపడాలనుకునే వారు ఈ నంబర్లలో 7337578899, 7337399299 సంప్రదించవచ్చని తెలిపారు.



## ఆగని హైడ్రా దూకుడు

శంషాబాద్ ఎయిర్ పోర్ట్ రోడ్డులో శుక్రవారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చివేతలకు దిగారు. పన్ను కట్టకుండా అక్రమంగా నిర్మించిన ప్రకటనల హోర్డింగ్ పాయింట్స్. అక్రమ హోర్డింగ్‌లను అధికారులు కూల్చివేస్తున్నారు. స్థానిక మున్సిపాలిటీ అధికారుల ఫిర్యాదుతో హైడ్రా చర్యలకు దిగింది. అలాగే శంషాబాద్‌లోని సిద్ధాంతి జాతీయ రహదారి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ ప్రాంతంలోని హోర్డింగ్‌లను తొలగించడానికి హైడ్రా సిబ్బందితో సహా ఇక్కడికి వచ్చి పరిశీలన జరుపుతోంది. మరికొద్ది సేపట్లో కూల్చివేతల ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కాగా కొద్ది రోజులుగా దూకుడు తగ్గించిన హైడ్రా మళ్లీ రంగంలోకి దిగింది. రెండు రోజుల క్రితం శంషాబాద్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ప్రహరీ గోడలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. సర్వే నంబర్లు 601, 602 లో చేపట్టిన ప్రహరీ గోడను కూల్చివేశారు. వివాదాస్పద రోడ్డు స్థలం విషయంలో ఫిర్యాదులు రావడంతో కూల్చివేశారు. అయితే తమ పట్టా భూమిలో తాము నిర్మించుకున్న ప్రహరీ గోడను హైడ్రా అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేసారని బాధితులు మండిపడుతున్నారు.



## జగన్ సైకోగా
## మారడమే 'జగన్ 2.0'

జగన్ సైకోగా మారడమే 'జగన్ 2.0' అని మంత్రి సంధ్యారాణి విమర్శించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. శవం లేస్తే కానీ బయటకు రాని దుర్మార్గుడు జగన్ అని ఆరోపించారు. వైఎస్ విజయలక్ష్మి, షర్మిల ఆయుష్షు గట్టిది కాబట్టే జగన్‌కు దూరంగా ఉంటున్నారని చెప్పారు. జగన తీరు మార్చుకోకుంటే.. రాష్ట్ర ప్రజలే ఏపీ నుంచి బయటకు గెంటేస్తారని అన్నారు. ఆత్మతో మాట్లాడే జగన్ మానసిక పరిస్థితి అందరికీ తెలుసని విమర్శించారు.

## అమెరికాలో విమానం మిస్సింగ్..
## రంగంలోకి దిగిన అధికారులు

అమెరికాలో ఓ విమానం అదృశ్యమైంది. పది మందితో అలస్కా మీదుగా వెళ్తున్న విమానం రాడార్ సిగ్నల్స్‌కు అందకుండా పోయింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు రంగంలోకి దిగారు. విమానం జాడ కనుక్కునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బేరింగ్ ఎయిర్ సంస్థకు చెందిన సెస్నా 208బీ గ్రాండ్ కారవాన్ ఎయిర్‌క్రాఫ్ట్ విమానం గురువారం మధ్యాహ్నం 2:37 గంటల సమయంలో అలస్కా పట్టణం ఉనల్కలేట్ నుంచి నోమ్‌కు బయల్దేరింది. ఆ సమయంలో విమానంలో తొమ్మిది మంది ప్రయాణికులు ఒక పైలట్ ఉన్నారు. అయితే విమానం నార్టోన్ సౌండ్ ప్రాంతంలోకి రాగానే రాడార్ సిగ్నల్స్‌కు అందకుండా పోయింది. విమానం జాడ కనుక్కునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అలస్కాలోని ప్రతికూల వాతావరణంగా కారణంగానే విమానం అదృశ్యమైనట్లు అధికారులు అనుమానిస్తున్నారు.



సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# కులగణనతో బీజేపీకి ఏం సంబంధం?

బీసీ కులగణన ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి పటిష్ట చర్యలు చేపడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కులగణనపై కుల సంఘాల నేతలకు వివరిస్తామని చెప్పారు. శుక్రవారం కరీంనగర్ లో ఓ మీడియా చానల్ తో మాట్లాడిన ఆయన.. సర్వే నివేదికపై ప్రజల్లో అపోహలు సృష్టించవద్దని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నేతలు సర్వేలో పాల్గొనలేదు. కానీ అవహేళన మాత్రం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలు వెనుకబడిన వర్గాలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సర్వేలో పాల్గొనని వారికి కులగణనపై మాట్లాడే అవకాశం లేదన్నారు. వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఉరుకుంటామా అని ప్రశ్నించారు. కులగణన చేయబోమని కేంద్రంలో బీజేపీ అఫిడవిట్ ఇచ్చింది. కులగణనతో బీజేపీకి ఏం సంబంధం అని ప్రశ్నించారు. బీజేపీ ఫ్యూడలిస్టిక్ పార్టీ అని ధ్వజమెత్తారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కులగణన చేయాలనే డిమాండ్ ఉంది. కానీ ఇప్పటివరకు చేయలేదు. కానీ మా ప్రభుత్వం కులగణన ప్రక్రియను పక్కాగా పూర్తి చేసిందన్నారు. బీసీలకు 42 శాతం సీట్లు ఇచ్చేందుకు మా పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కులగణనను దేశం మొత్తం చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నారని చెప్పారు.

## వివాదంలో హాలీవుడ్ నటి

# కార్లా సోఫియా గాస్కాన్

సినీరంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల వేడుక మరికొన్ని రోజుల్లో ప్రారంభంకానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 2025 ఆస్కార్ పురస్కారాల నామినేషన్ జాబితాను అకాడమీ ప్రకటించగా.. ఇందులో 'ఎమిలియా పెరెజ్' చిత్రం మొత్తం పదమూడు నామినేషన్స్ సాధించి ఆస్కార్ రేసులో అగ్ర భాగాన నిలిచింది. అయితే 'ఎమిలియా పెరెజ్'లో నటనకు గాను నటి కార్లా సోఫియా గాస్కాన్ ఉత్తమ నటి విభాగంలో పోటిపడుతున్న విషయం తెలిసిందే. ఫస్ట్ టైం ఒక ట్రాన్స్ జెండర్ నటి ఈ విభాగంలో నామినేట్ అయ్యింది. ఇదిలావుంటే తాజాగా కార్లా సోఫియా గాస్కాన్ వివాదంలో చిక్కుకుంది. అప్పట్లో తాను చేసిన జాత్యహంకార వ్యాఖ్యలు ఇప్పుడు తన ఆస్కార్‌కి చిచ్చుపెట్టేలా చేశాయి. నల్లజాతీయుడైన జార్జ్ ఫ్లాయిడ్ అనే వ్యక్తిని అమెరికా పోలీసులు కాలుతో తొక్కి చంపిన విషయం తెలిసిందే. 2020లో ఈ ఘటన జరిగింది. అయితే ఈ విషయంపై అమెరికాలో పెద్ద ఎత్తున్న నిరసనలు జరగడమే కాకుండా ప్రభుత్వం కూడా దిగివచ్చి క్షమాపణలు తెలిపింది. అయితే ఈ వివాదంపై నటి కార్లా సోఫియా స్పందిస్తూ.. చాలా మంది జార్జ్ ఫ్లాయిడ్ మరణం గురించి పట్టించుకోలేదు. అతడు ఒక మాదకద్రవ్యాలకు బానిసయైన




మోసగాడు, కానీ అతని మరణం మళ్లీ ఒకసారి నల్లజాతి ప్రజలను హక్కులు లేని వారిగా భావించేవారిగా చేసింది. అలాగే పోలీసులు హంతకులుగా చిత్రీకరిస్తుంది. ఇది అందరి తప్పు అని వెల్లడించింది. ఇస్లాం మతంపై స్పందిస్తూ.. ఇస్లాం అనేది మానవాళికి వైరస్‌గా మారుతుంది. దీనిని తుడిచివేయాలి అంటూ రాసుకోచ్చింది. అలాగే ఆస్కార్ అవార్డులపై కూడా విమర్శలు చేస్తూ.. నేను ఆస్కార్ అవార్డుల పోటీకి వచ్చానో లేదా బ్లాక్ లైవ్స్ మేటర్ ఈవెంట్‌కి వచ్చానో తెలియట్లేదు. ఇది ఆఫ్రికన్ — కొరియన్ పండుగలా ఉంది అంటూ చెప్పకోచ్చింది. అయితే ఈ వ్యాఖ్యలను ప్రస్తుతం నెటిజన్లు వైరల్ చేస్తున్నారు. దీంతో ఆస్కార్‌కి కార్లాని ఎలా నామినేట్ చేశారని సోషల్ మీడియాలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

## పదో తరగతి విద్యార్థినిపై

# ప్రిన్సిపల్ లైంగికదాడి



ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువు తున్న విద్యార్థినిపై ప్రిన్సిపల్ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. కన్నబిడ్డలా చూసుకుంటూ విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువే స్టూడెంట్‌పై లైంగికదాడి చేసిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన దీనావన్ రావు.. సీతారాంపేట్ సమీపంలో లయోలా ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలను నడుపుతున్నాడు. పదో తరగతి చదువుతున్న విద్యార్థి (16)నితో అసభ్యంగా ప్రవర్తిస్తూ వస్తున్న ప్రిన్సిపల్.. బుధవారం లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్లిన బాధితురాలు జరిగిన విషయం ఆమె తల్లికి చెప్పింది. దీంతో ఆమె తల్లి ఇబ్రహీంపట్నం పోలీస్టోస్టేషన్‌లో దీనావన్‌రావుపై ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థిని వైద్య పరీక్షల నిమిత్తం దవాఖానకు పంపిచామని ఏసీపీ రాజు తెలిపారు.

# ఓటీటీ స్ట్రీమింగ్‌కు వచ్చేసిన 'గేమ్ ఛేంజర్'

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన రీసెంట్ మూవీ 'గేమ్ ఛేంజర్' ఎలాంటి భారీ అంచనాల మధ్య రిలీజ్ అయ్యిందో అందరికీ తెలిసిందే. సంక్రాంతి బరిలో మరో రెండు సినిమాలకు పోటీగా ఈ మూవీ రిలీజ్ అయ్యింది. ఈ సినిమాను స్టార్ డైరెక్టర్ శంకర్ తెరకెక్కించాడు. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేయడంతో ఈ మూవీపై అంచనాలు తారాస్థాయిలో నెలకొన్నాయి. అయితే, రిలీజ్ తర్వాత ఈ చిత్రానికి నెగెటివ్ ఫీడ్‌బ్యాక్ రావడంతో ఈ మూవీ ఫ్లాప్ టాక్‌ను తెచ్చుకుంది. ఈ ప్రభావం చిత్ర కలెక్షన్స్‌పై కూడా పడింది. అటు సంక్రాంతి బరిలో రిలీజ్ అయిన సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహారాజ్ చిత్రాలు బ్లాక్‌బస్టర్ హిట్లుగా నిలవడంతో ఈ మూవీకి ప్రేక్షకాదరణ తగ్గింది. ఫలితంగా ఈ మూవీ కమర్షియల్‌గా డిజాస్టర్ అయ్యింది. కాగా, ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యింది. ఈ సినిమా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో నేటి(ఫిబ్రవరి 7) నుంచి స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. ఈ చిత్రాన్ని థియేటర్లలో మిస్ అయిన వారు ఓటీటీలో చూసి ఎంజాయ్ చేస్తారని మేకర్స్ తెలిపారు. ఇక ఈ సినిమాలో అందాల భామ కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించగా అంజలి, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు.







# లావణ్యపై శేఖర్ బాషా సంచలన వ్యాఖ్యలు

నగ్న వీడియోల కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో మస్తాన్ సాయితో పాటు ఆర్జే శేఖర్ బాషాపై కూడా కేసు నమోదు అయ్యింది. లావణ్యను డ్రగ్స్ కేసులో ఇరికించాలని ప్రయత్నం చేశారని, అందులో భాగంగానే శేఖర్ బాషా కూడా మస్తాన్ సాయితో ఫోన్‌లో మాట్లాడారంటూ ఆర్జేకు సంబంధించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో శేఖర్ బాషా మాట్లాడుతూ.. డ్రగ్స్ తీసుకెళ్లి లావణ్య ఇంట్లో పెట్టమని ఎక్కడా చెప్పలేదని.. మస్తాన్ సాయి కాల్ చేసిన సమయంలో డ్రగ్స్ వాడుతున్నట్లైతే కచ్చితంగా పట్టించాలని ఉద్దేశంతోనే కాల్ మాట్లాడినట్లు.. తనకు ఈ అంశంతో ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. లావణ్య ఎన్నోసార్లు అనేక చోట్ల పట్టుబడ్డారని తెలిపారు. తనను ఇరికించారని చెబుతున్న లావణ్య డ్రగ్ టెస్టు ఎందుకు చేసుకోవడం లేదని ప్రశ్నించారు.

## వైసీపీ కీలక నేతతో

# ఆర్జీవీ మంతనాలు!

ప్రకాశం జిల్లా మద్దాపాడు మండలం వెల్లంపల్లిలో ఈ రోజు ఉదయం రాంగోపాల్‌వర్మను మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కలిశారు. ఓ హోటల్‌లో వీరిద్దరూ మంతనాలు సాగించారు. ఇవాళ్ల ఒంగోలు రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఆర్జీవీ విచారణకు హాజరుకావలసి ఉంది. గతంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫోటోలు మార్ఫింగ్ చేసి రాంగోపాల్ వర్మ ఎక్స్‌లో పోస్ట్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఆయనకు రెండు సార్లు పోలీసులు నోటీసులు ఇచ్చినా హాజరు కాలేదు. కొద్దిరోజుల పాటు అజ్ఞాతంలోకి వెళ్లారని కూడా వదంతులు వినిపించాయి. అదేం లేదంటూ తాను అందుబాటులోనే ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఆ తర్వాత ఆయన హైకోర్టులో ముందస్తు బెయిలు పొందారు. ఆ సమయంలో కోర్టు ఇచ్చిన సూచనల మేరకు ఆయన విచారణకు హాజరు కావలసి ఉంది. ఈ రోజు ఆయన ఒంగోలు చేరుకోవాల్సి ఉండగా.. మార్గ మధ్యలో వైసీపీ కీలకనేతతో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.



## రెపో రేటు పావు శాతం తగ్గించిన ఆర్బీఐ..

# ఐదేళ్ల తర్వాత తొలిసారి

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడ్ న్యూస్ చెప్పింది. విశ్లేషకుల అంచనాలను నిజం చేస్తూ కీలక వడ్డీ రేట్లను తగ్గించింది. దాదాపు ఐదు సంవత్సరాల తర్వాత మొదటిసారిగా రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఇటీవలి బడ్జెట్ నేపథ్యంలో ఈ ద్రవ్యసమీక్షపై అటు వ్యాపార-పారిశ్రామిక రంగాలు, ఇటు బ్యాంకర్లు-రుణగ్రహీతలు భారీగానే ఆశలు పెట్టుకున్నారు. దీనికి తగ్గట్టుగానే రెపో రేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) కోత పెట్టింది ఆర్బీఐ. తాజా నిర్ణయంతో ఇప్పటి వరకూ 6.50 శాతంగా ఉన్న రెపో రేటు 6.25 శాతానికి దిగొచ్చింది. అలాగే రెండేళ్ల తర్వాత వడ్డీ రేట్లను సవరించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

ఐదేండ్ల తర్వాత..

గత రెండేండ్లుగా వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ ద్రవ్యసమీక్షలు ముగుస్తున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా రెపో రేటును 6.50 శాతానికి పెంచారు. అప్పట్నుంచి ఇది అక్కడే ఉంటున్నది. ఇక రెపో రేటును ఆఖరిసారిగా తగ్గించింది 2020 మే నెలలోనే. కరోనా దెబ్బకు దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థలో నూతనోత్సాహన్ని నింపేందుకు నాటి గవర్నర్ శక్తికాంత్




దాస్ ప్రత్యేకంగా ఆర్బీఐ సమీక్ష నిర్వహించి రెపో రేటును తగ్గించారు. రుణ లభ్యత పెరిగేలా 4 శాతానికి దించారు. కానీ ద్రవ్యోల్బణం విజృంభించడంతో తదుపరి ద్రవ్యసమీక్షల్లో దాన్ని అదుపు చేసేందుకు మళ్లీ వడ్డీరేట్లను వరుసగా పెంచుతూపోయారు.

ఈ క్రమంలో ఐదేళ్ల తర్వాత ఇప్పుడు వడ్డీరేట్లను ఆర్బీఐ తగ్గించడం విశేషం. ఈ తగ్గింపుతో రుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉంది.